# గుండెల్లో గుండె

ఎన్నికల నోటిఫికేషన్ జారీ అయింది. దాంతో రాజకీయ పార్టీలలో స్తబ్ధతపోయి చైతన్యం చోటుచేసుకుంది. పార్టీ కార్యాలయాలన్నీ తిరునాళ్ళలో దుకాణాల్లాగా వచ్చేపోయేవారితో కిటకిటలాడుతున్నాయి. మంది బలం చూపితేనే కాని పార్టీ అధినేతల ముఖాలలో మందహాసం కనిపించదని భావించి ప్రతి అభ్యర్థి మందుబలంతో మందలను పోగుచేసి తమ మందిబలాన్ని ప్రదర్శిస్తున్నారు. ఒక వర్థమాన నాయకుడు మెళ్లో దండలు వేసుకుని ముఖాన కుంకుమబొట్టు పెద్దగా నిలువుగా పెట్టుకుని చేతులు జోడించి చిరునవ్వులు చిలకరిస్తూ జీపులోనో, టాపులేని కారులోనో నిలబడి రోడ్డుమీద పోయే ప్రతివారికీ తల పదేపదే వంచుతూ నమస్కారాలు వడ్డిస్తుంటాడు. ఆ వెనకనే మరికొన్ని కార్లు, ఇంకొన్ని మోటారు సైకిళ్ళు, స్కూటర్లు, ఆ వెనక సైకిళ్లబారులూ, వారివెంట పాదచారులూ, ఈ సంరంభం అంతా ఒళ్ళు బలిసినవారి పెళ్లి ఊరేగింపులా సాగిపోతూ ఉంటుంది. "ఫలానావాడు జిందాబాద్ - ఫలానా పార్టీకి జై" వంటి నినాదాలు మిన్నుముట్టి సాటిలైట్స్‌ను తాకి తిరిగి భూమిని జేరే టి.వి. సిగ్నల్స్‌లాగా నలువైపులనుంచి ప్రతిధ్వనిస్తుంటాయి. పార్టీ ఆఫీసు లేదా నామినేషన్ వేసే ఆఫీసు దగ్గరయ్యేసరికి నినాదాల జోరు ఎక్కువవుతుంది. మద్దతుదారులు పూనకం పూనిన గణాచారులులాగా ఊగిపోతూ ఇళ్లు ఊగిపోయే స్థాయిలో నినాదాలు చేస్తుంటారు. ఆ ఊగిపోవడానికి చుక్కబలంకూడా చక్కని కారణాలలో ఒకటి. ఇంక నామినేషన్ వేసేరోజున ఎల్లయ్యగారు రెండు వందలమంది మందీ మార్భలంతో వస్తే, పుల్లయ్యగారు మరో వందమందితో మరిన్ని వాహనాలతో వేంచేస్తారు. కామయ్యగారు ఇంకో రెండువందలమదినికలుపుకుని బాణసంచా పేలుస్తూ, టపాకాయలు కాలుస్తూ వస్తారు. భీమయ్యగారు ఇవన్నీ కాక పెద్ద బ్రాస్‌బాండ్‌మేళంతో వస్తారు. ఇలా ఎవరు ఎన్నివిధాల బలప్రదర్శన చేసినా పార్టీ నాయకుల అంతరంగాల్లోని అంచనాలు, ఆలోచనలు వేరుగా వుంటాయి. వారి 'ఎస్టిమేట్'లకు కొలమానాలు వేరుగా వుంటాయి. ధనబలం, కులబలం, కండబలం, గుండెబలం వగైరా బలాలన్నీ బలంగా పనిచేస్తాయి. ఆ ఊరు రాజకీయంగా చాలా చైతన్యవంతమైనది. ఆ నియోజకవర్గ ప్రజలు అనిమిషులవలె ఎప్పుడు ఎవరికి పట్టం కడ్తారో, పెద్దపీట వేస్తారో, ఎంతటి తల పండిన రాజకీయవేత్తలకూ అంతుపట్టదు. ఆ ఊరి ప్రత్యేకత ఏమిటంటే అక్కడ ఏ రాజకీయ పార్టీ అయినా ఓడిపోతే దాని ప్రభావం మిగిలిన నియోజకవర్గాలమీదకూడా వుంటుంది. అందుచేత ఏ పార్టీకూడా ధైర్యంచేసి సొంత జండామీద నిలబడదు.



ఏ ఇండిపెండెంట్ అభ్యర్థినో తమమీద ఇండిపెండెంట్‌గా నిలబెట్టి తెరవెనుకనుంచి మద్దతునిస్తుంది. ఆ అభ్యర్థి ఓడిపోయినా పార్టీ పరాజయం పొందినట్లనిపించదు. గెలిస్తే తెరవెనకనుంచి మద్దతిచ్చిన పార్టీలోకి దూరిపోతాడు. ఈ చాణక్యాన్ని అన్ని రాజకీయపార్టీలు అవలంబిస్తూనే వుంటాయి.

ఈసారి ఎన్నికలలో ప్రధానంగా రంగంలో వున్నవి తెల్లదుస్తుల పార్టీ, పచ్చగుడ్డల పార్టీ. వీటితరపున జయరావు, శ్యామరావు అభ్యర్థిత్వాలు ఖాయం అయ్యాయి.

ఇక రెట్టించిన ఉత్సాహంతో ఇద్దరూ రంగంలోకి దుమికారు. పొట్టేళ్లుగా పుట్టివుంటే తలతో ఢీకొని బరిలో బుర్రలు బద్దలుకొట్టుకునేవారు. అయితే ప్రజాస్వామ్యం మరీ పొంగి పొరలుతుండడంతో నోళ్లకి మాత్రమే పనిపెట్టి తిట్లవర్షంతో సంతృప్తిపడసాగారు. వారి ఉపన్యాసాలలో తాము గెలిస్తే చేయ తలపెట్టిన ఘనకార్యాల గురించిన ప్రస్తావన మచ్చుకి కూడా కనిపించేదికాదు. శ్యామరావు దగుల్బాజీ అని జయరావు, జయరావు 420 అని శ్యామరావు ఇలా తిట్టినతిట్టు తిట్టకుండాకొత్త కొత్త తిట్లను కనిపెడ్తూ ఆ తిట్లను కొత్త తరహాలో జనం ముందు వదులుతూ శ్రోతలకు కావలసినంత ఉచిత వినోదం కల్పించసాగారు. అంతేకాదు, ఈసారి ఎన్నికలలో ఆడియో కేసెట్లు, వీడియో కేసెట్లు ముమ్మరంగా విడుదల అయ్యాయి. వీటిలో వ్యంగ్యాత్మకంగా, అన్యాపదేశంగా జోకులు, చెణుకులు, నాటికలు, గేయాలు, రూపకాలు వగైరా వగైరా ఆకాశవాణి, దూరదర్శన్‌ల వారికి కూడా తెలియని కొత్త కొత్త ప్రక్రియలలో కూడా ప్రొడ్యూస్‌చేసి జనం మీదికి వదలసాగారు. ఇవికాక వీధినాటకాలు, బుర్రకథలు, జానపద గీతాలు వంటివి ఎక్కువగా

పల్లెప్రజల పాలిట పడ్డాయి. ఇంక రథయాత్రలు సరేసరి. మొత్తంమీద ఆంధ్రావని అంతా నవచైతన్యంతో, కొత్త యౌవనంతో పెళపెళలాడిపోతోంది. ఎన్నికల తేదీ సమీపిస్తున్న కొద్దీ ఆత్మస్తుతీ, పరనిందా దినచర్యలో భాగం అయ్యాయి. పరస్పర దూషణలు పరిమితులు దాటిపోయాయి. వారి అభిమానులూ, వీరి అనుచరులూ ఒకేచోట తారసిల్లడం తటస్థిస్తే కొట్టుకోవడం రూలు అయిపోయింది. జయారావు, శ్యామారావు ఎప్పుడూ ఒంటరిగా ఎదురుపడలేదు. కాని పడి వుంటే ఒకరినొకరు చంపుకునేవారే.

ఎల్లాగైతేనేం! ఎన్నికల పర్వం ముగిసింది. ఆ యుద్ధకాండ ముగిసేసరికి స్మశాన ప్రశాంతత నెలకొంది జయారావు విజయం పొందాడు. అయితే చావుతప్పి కన్నులొట్టబోయినట్లు కేవలం 111 ఓట్ల మెజారిటీతో గెలిచాడు. అన్యాయం, అక్రమం, రిగ్గింగ్, దొంగోట్లు ఈ ఎన్నిక చెల్లదు అంటూ రుద్రతాండవం చేయసాగాడు శ్యామారావు. తిరిగి ఓట్లు లెక్కింపు జరగాలని పట్టుబట్టాడు. ఆయన కోరిక మేరకు తిరిగి ఓట్ల లెక్కింపు జరిగింది. అందువల్ల కేవలం పై పదకొండు ఓట్లు తగ్గాయికాని ఎన్నికల ఫలితం మాత్రం మారలేదు. శ్యామారావు అగ్గిమీద గుగ్గిలం అయిపోయాడు. అక్రమాలతో గెలిచారని ఎగస్పార్టీవారినీ గెలిపించలేకపోయినందుకు తమ వారినీ తరతమ బేధం లేకుండా పక్షపాత రహితంగా తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టాడు. ఎంతటి అస్మదీయుడైనా ఎదుట పడితే కరిచేటట్లు, కొరికేటట్లు ప్రవర్తించసాగాడు. దాంతో ఆ ఉగ్రనరసింహావతారం దగ్గరకు వెళ్లడానికి ఎవరూ ధైర్యం చేయలేకపోయారు. తిట్టి తిట్టి అలసిపోయాకే శాంతించాడు శ్యామారావు. కాలం ఎటువంటి గాయాలనైనా మాన్పుతుంది. అయితే ఎన్నో అక్రమాల పట్టికనొకదానిని తయారుచేసి జయారావు ఎన్నిక చెల్లదంటూ కోర్టులో కేసు వేశాడు. కోర్టులో తనకు తప్పక విజయం సిద్ధిస్తుందన్న ధీమాతో ఆశాజీవిగా బ్రతకసాగాడు శ్యామారావు.

కొద్దికాలం గడిచింది. శ్యామారావు పెట్టిన కేసు కోర్టులో ఊరగాయలో ముక్కలాగా నానుతూనే వుంది. అతని గుండెలో పగ మాత్రం భగభగమని పైకి అనకపోయినా నివురుగప్పిన నిప్పులా లోలోపలే రాజుకుంటోంది. ఆ ఊరిలోని పెద్దలు కొందరికి కల్యాణ మంటపం కమ్ ఫంక్షన్ హాల్ కట్టించాలన్న సత్సంకల్పం కలిగింది. దానికి నిధులు సమకూర్చే నిమిత్తం మదరాసునుంచి, హైదరాబాదునుంచి సినీ కళాకారులను రప్పించి బ్రహ్మాండమైన కార్యక్రమం ఒకదానిని ఏర్పాటు చేశారు. ఆ ప్రోగ్రాంకి పురప్రముఖులు ఎందరినో ఆహ్వానించారు. సహజంగా ఊరి ఎమ్మెల్యే అయిన జయరావునీ, గతంలో ఒక వెలుగు వెలిగిన మాజీ ఎమ్మెల్యే శ్యామారావునీ పిలిచారు. ఆ నియోజకవర్గపు ఎం.పి అయిన రాజుగారిని ఆనాటి ఫంక్షన్‌కి అధ్యక్షుని చేశారు. జయరావుకి మెమెంటోలు ప్రదానంచేసే బాధ్యతను అప్పజెప్పారు. ఎంతచెడ్డా శ్యామారావు కూడా పలుకుబడిగల ఊరిపెద్ద. పైగా గతంలో ఎమ్మెల్యేగా వుండడమేకాకుండా కింగ్‌మేకర్ అని అనిపించుకున్నంతటి పలుకుబడిగలవాడు. అదృష్టం తిరగబడి వెంట్రుకవాసిలో విజయం తన్నిందికాని మరోసారి ఎన్నికలు జరిగితే గెలిచే అవకాశాలు పుష్కలంగా వున్నవాడు అంతదాకా ఎందుకు? కోర్టు కేసు అతని పక్షాన అయిందంటే జయరావుని ఓతోపు తోసి అమాంతం ఎమ్మెల్యేగానూ, ఆ తర్వాత అమాత్యునిగానూ రాగలిగినవాడు. అందువల్ల ఆయనను ఎప్పుడూ ప్రసన్నునిగా చేసుకోవడం అవసరం. ఇవన్నీ ఆలోచించి శ్యామరావుకు సావనీర్‌ని విడుదలచేసే గౌరవం కల్పించారు. కార్యక్రమ నిర్వహణకు సంబంధించిన వేదికమీదకు ఆహ్వానించారు. యాదృచ్ఛికంగానో, ఉద్దేశపూర్వకంగానో వారు ఉభయులూ ప్రక్క ప్రక్క ఆసనాలలో కూర్చోవడం జరిగింది. ప్రైవేట్‌గా త్వం శుంఠః త్వం శుంఠః అని తిట్టుకున్నా అది

సభావేదిక కాబట్టి, సభామర్యాదలు అంటూ కొన్ని అఘోరించాయి కనుక, పైకిమాత్రం ముఖాలకు నవ్వులు పులుముకుని, అపేక్షలు ఒలకబోసుకుంటూ, నోళ్లు వెడల్పు చేసుకుని అట్టహాసం కాకపోయినా మందహాసాలతో హుందాగా మాట్లాడుకోవడం మొదలుపెట్టారు. అది చూసినవారికి "కలయో-కలియుగ మాయయో, సభా మహత్యమో అన్నంత ఆశ్చర్యం కలిగి వారి అన్యోన్యం కలకాలం వుండాలని కోరుకున్నారు. సావనీర్ విడుదల చేసే సందర్భంలో శ్యామారావు చిరుప్రసంగం చేశారు. ఊరిపెద్దల సత్సంకల్పాన్ని కొనియాడుతూ. శ్రమపడి సమీకరించిన నిధులను పరాన్నభుక్కులు, పందికొక్కులు తినకుండా జాగ్రత్త పడాలి అని హెచ్చరించారు. "పందికొక్కులు" అన్నమాటను ఉచ్చరిస్తున్నప్పుడు ఓరకంట తన వంక కొంటెగా చూసినచూపు సూటిగా జయరావు గుండెలో ఈటెలా దిగింది.

అ తర్వాత మెమెంటోల ప్రదానం అయ్యాక జయరావు ప్రసంగించాడు. మర్యాద వాచకాలు అయ్యాక అన్యాపదేశంగా శ్యామారావుని దెప్పిపొడిచాడు. నిస్వార్థంగా ఊరిపెద్దలు నిధులు ప్రోగుచేసినా ఈనగాచిన పంటను మింగివేయడానికి నక్కలు కాచుకుని వుంటాయని నిలువెల్లా స్వార్థంగల తోడేళ్లు నిధులను స్వాహా చేయడానికి సిద్ధంగా వుంటాయని, వాటిని దరిదాపులకు రాకుండా తరిమికొట్టాలని అవసరమైతే అంతం చేయాలని హెచ్చరించాడు. ఇద్దరూ తిరిగి యధాస్థానాలలో కూర్చున్నాక ముఖాలు కందగడ్డలుగా మారినా, మీగడ తరగల్లాగా ముఖాలకు కాస్తంత చిరునవ్వుని పులుముకున్నారు. అధ్యక్షులవారు కార్యవర్గ సభ్యులను ప్రత్యేకంగా సన్మానించడంకోసం వేదికకు ఒక ప్రక్కగా వెళ్లారు. శ్రీవారు అటు వెళ్లగానే శ్యామారావు నిప్పులు చెరిగే కళ్లతో "ఏమిటి నా అంతం చూస్తావా...నీ తరమా... నీ అబ్బ తరమా" అన్నాడు నెమ్మదిగా ప్రక్కనే వున్న జయరావుతో.

"నీ అంతం చూడడానికి నా అబ్బను పిలవనక్కరలేదు. నేను ఒక్కడిని చాలు" అన్నాడు. జయరావు మెల్లగా.

"నువ్వేం చూస్తావు. నీ గుండెలోనో గూడుకట్టుకుని కూర్చుంటా. పక్కలో బల్లెంలా నిలుస్తా ఏమిటనుకుంటున్నావో!"

"నా గుండెల్లో ప్రవేశించావంటే నీ పని అంతే. పద్మవ్యూహంలో చిక్కుకున్న అభిమన్యుడిలాగా, సాలెగూట్లో చిక్కుకున్న ఈగలాగా అక్కడే సమాధి అయిపోతావు. ఏమనుకుంటున్నావో! పక్కలో బల్లెం అంటున్నావు. అసలు నీకు బొక్కలుకూడా మిగలవు".

"చూద్దాం ఎవరు ఎవరిని ఏంచేస్తారో!"

"అలాగే చూద్దాం!"

అధ్యక్షులవారు తిరిగి యధాస్థానానికి రావడంతో శ్యామరావు, జయరావుల సరస సంభాషణకి తెరపడింది. మళ్లీ మందహాసం ముఖాలకు ఎక్కింది. నిర్వాహకుల వందన సమర్పణతో సభ విజయవంతంగా ముగిసింది.

జయరావు తన నియోజకవర్గంలో తరచుగా పర్యటనలు చేస్తూ ప్రజలను కలుసుకోసాగాడు. అలా చేస్తే ముఖ్యమంత్రిగారి కంటబడడమో, వార్తలు వారి చెవికిచేరడమో జరిగి, మంత్రివర్గ విస్తరణలో తనకు ఓ మంత్రి పదవి దొరకవచ్చునని ఆశ.

శ్యామరావుకూడా ఆ నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించసాగాడు. పదవి కోల్పోయినవారి ముఖం ప్రజలు చూడరని అయనకు బాగా తెలుసు. అందువల్ల వారి ముఖాలను తానే చూడాలనుకున్నాడు. ఆ విధంగా చేస్తుంటే ఏవో కార్యక్రమాలు పెట్టి వారి మధ్యన తిరుగుతుంటే అవే పెట్టుబడిగా మారి భవిష్యత్‌లో తనకు విజయ ప్రాప్తికి దోహదపడ్తాయని నమ్మకం.

ఒకసారి పర్యటనలో వుండగా జయరావుకి అమితమైన గుండెనెప్పి వచ్చింది. వెంటనే హుటాహుటిన ఆస్పత్రిలో జేర్పించారు. అది తీవ్రమైన గుండెపోటు అనీ, అయితే మొదటిసారి కావడం, వెనువెంటనే వైద్య సహాయం లభించడంవల్ల ప్రమాదం తప్పిందనీ వైద్యులు చెప్పారు. ఆయన పర్యటనలు బొత్తిగా మానేసి పూర్తి విశ్రాంతి తీసుకోవాలని హెచ్చరికలాంటి సలహా ఇచ్చారు. ఆయన గుండె బాగా దెబ్బతిందనీ, మరో అటాక్ వస్తే వేరే గుండెను ట్రాన్స్‌ప్లాంట్ చేయాల్సిన అవసరం కలగవచ్చునని కూడా సూచనప్రాయంగా చెప్పారు ఆయన బంధువులకు.

జయారావుకి గుండె జబ్బు వచ్చిందని తెలిసి పట్టరాని సంతోషంతో పరవశించిపోయాడు శ్యామారావు. "ఈ ఓటిగుండెవాడా నన్ను తనగుండెలో బిగిస్తానని ప్రగల్బాలు పలికింది" అనుకుని నవ్వుకున్నాడు. తన పర్యటనలను మరింత ఉధృతంగా జరుపసాగాడు. ప్రజలు తన ముందు ఏమంటారో తెలుసు. వెనుక తన గురించి ఏమి వ్యాఖ్యలు చేస్తున్నారో తెలుసుకోవడంకోసం మారువేషాల్లో ఒంటరిగా సంచరించడంకూడా మొదలుపెట్టాడు. అటువంటప్పుడు ఆయన ఆచూకీ ఆయన అంతరంగికులకు కూడా తెలిసేదికాదు.

జయరావు ఆరోగ్యం కొంత కుదుటపడింది. తిట్టేనోరూ, తిరిగే కాలూ ఊరుకోవన్నట్లు వద్దన్నా వినకుండా మళ్లీ పర్యటనలు మొదలుపెట్టాడు. డాక్టర్ హెచ్చరిక ఆయన చెవిన వేస్తే ఆ ఓటిగుండె కాస్తా సూటిగా ఆగిపోతుందేమో, ట్రాన్స్‌ప్లాంట్ వ్యవధికూడా లేకుండా పోతుందేమోన్న భయంతో చెప్పలేకపోయారు ఆయనవాళ్లు.

ఆరోజు పర్యటనలో వుండగా జయరావుకి రెండోసారి ఉధృతంగా హార్ట్ ఎటాక్ వచ్చింది. వెంటనే ఆయన్ని ఆఘమేఘాలమీద సూపర్‌స్పెషాలిటీస్ ఆస్పత్రిలో చేర్పించారు. డాక్టర్లు పరీక్షించి నలభై ఎనిమిది గంటల్లోగా హార్ట్ ట్రాన్స్‌ప్లాంట్ చేయాలనీ లేదా బ్రతకడం కష్టమనీ తేల్చి చెప్పేశారు. ఈ లోగా ఆరోగ్యవంతుడైన వ్యక్తి ఎవరైనా యాక్సిడెంట్‌లో చనిపోతే ఆ గుండెను సేకరించి ట్రాన్స్‌ప్లాంట్ చేయవచ్చునని చెప్పారు. అటువంటి గుండెకోసం అన్ని ఆస్పత్రులనూ అలెర్ట్ చేశారు. జయరావు బంధువులు, అభిమానులు ఆరోగ్యవంతుడైన వ్యక్తి ఎవరైనా యాక్సిడెంట్‌లో మరణించాలని, ఆ గుండెతో జయరావు బ్రతకాలనీ కోరుతూ ప్రార్థనలు మొదలుపెట్టారు. వేయి దేవుళ్లకు లక్షమొక్కులు మొక్కుకున్నారు.

భగవంతుడు వారి మొర ఆలకించాడో ఏమో ఎవరో ఆరోగ్యవంతుడైన నడివయస్కుడు ప్రమాదవశాత్తు రైలుక్రింద పడి మరణించాడనీ, అతని ముఖం గుర్తుపట్టలేనంతగా శిథిలం కావడంతో అతడు ఎవరైనదీ తెలియలేదనీ, మనిషి ఊరివానిలా అనిపిస్తున్నాడనీ, వేరే ఆధారాలు ఏవీ లేవనీ వార్త వచ్చింది. వెంటనే అతని గుండెను సేకరించే ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. వైద్యులు మొక్కుబడిగా పోస్టుమార్టంచేసి గుండెను భద్రంగా తీసి చేతికిచ్చారు. జయరావుకి హార్ట్ ట్రాన్స్‌ప్లాంట్ విజయవంతంగా

జరిగింది. రెండు మూడు వారాలలోనే పనులన్నీ యధాప్రకారం చేసుకోగలుగుతున్నాడు. అయితే వైద్యుల హెచ్చరిక మీద టూర్లు బొత్తిగా మానివేశాడు. అయితే ఆయనలో ఏదో మార్పు వచ్చింది. రానురాను అది ప్రస్ఫుటం కాసాగింది. విపరీతమైన కోపం, అసహనం రాసాగాయి. ప్రతివారినీ తిట్టడం, కొట్టేంత పనిచేయడం మొదలుపెట్టాడు. తనకి సంబంధించిన మనుష్యులైతే మరీనూ. వాళ్లని చూస్తే అగ్గిమీద గుగ్గిలం అయిపోసాగాడు. అద్దంలో తనను చూసుకున్నా విపరీతమైన కోపం వచ్చేది. కోపంతో అద్దాన్ని పగలగొట్టేవాడు. ఎవరిమీదనో ప్రతీకారం తీర్చుకోవాలన్న కోరిక ప్రబలంగా వున్నట్లనిపిస్తుండేది. ఆ ప్రగాఢ వాంఛతో గుండె బ్రద్దలైపోతుందేమోననిపించేది. చూసేవారికి అసలు ఈయన జయరావేనా అన్న అనుమానం వస్తుండేది.

పాండవుల అరణ్యవాసం, అజ్ఞాతవాసం పన్నెండేళ్లు. రాముని అరణ్యవాసం పధ్నాలుగేళ్లు. శ్యామారావు అజ్ఞాతంగా మారువేషాలలో ఎంత తిరిగినా రెండు మూడు వారాలు మించి వుండేదికాదు. ఈ ఈసారి రెండు నెలలు గడుస్తున్నా ఆయన అయిపులేడు. ఆయన కుటుంబీకులు, అనుచరులు, అశ్రితులు, అభిమానులు అందరూ ఆందోళనతో అలమటించసాగారు.

జయరావు వింత ప్రర్తన మితిమీరుతుండడంతో ఆయన్ని సైకియాట్రిస్ట్ దగ్గరకు తీసుకువెళ్లారు. వాళ్లు జయరావుకి అమర్చిన గుండె, ఆయన్ని విపరీతంగా ద్వేషించేవ్యక్తి ఎవరిదో అయి వుండాలని అందుకే ఆయన తనపైన, తనవారిపైన ద్వేషాన్ని ప్రదర్శిస్తున్నాడని తెలిపారు. ఇది ముదిరితే ఆయన హత్యలుకూడా చేయగలడనీ లేదా ఆత్మహత్యకూడా చేసుకోవచ్చుననీ హెచ్చరించారు. తమ వైద్యబృందం కూలంకషంగా చర్చించి తగిన చికిత్స త్వరలోనే మొదలుపెట్తామని చెప్పారు. ఎప్పుడైతే ఈ విషయం రూఢీ అయిందో శ్యామారావు అంతర్థానానికీ, జయరావు వింత ప్రవర్తనకీ సంబంధం లేదుకదా అన్న అనుమానం వచ్చింది. ఈ కొత్తకోణంలో పరిశోధన ప్రారంభించేసరికి శ్యామరావు మారువేషంలో సంచరిస్తుండగా రైలు క్రిందపడి మరణించారనీ, ఆయన గుండెనే జయరావుకి అమర్చడం జరిగిందన్న విషయం బయటపడింది. ఎంత కట్టడిచేసినా ఈ వార్త గుప్పుమంది. జయరావుకీ తెలిసింది.

జయరావు ఆనందానికి అవధులు లేవు. "ఒరే శ్యామారావు... నువ్వు నన్ను చంపుతానని ప్రగల్భాలు పలికావు. ఇప్పుడు నువ్వే చచ్చావు. అంతేకాదు. నేనన్నట్లు నా గుండెల్లోనే బందీ అయ్యావు. ఇప్పుడేం చేస్తావు?" అంటూ పగలబడి నవ్వసాగాడు.

లోపలనుండి తన గుండె అతి త్వరగా విస్తరిస్తున్నట్లు అనిపించింది.

"నీ గుండెల్లో గూడుకట్టుకుని వుండి నీకు శాంతిలేకుండా చేస్తానని" ఎవరో అంటున్నట్లు అనిపించింది. తన ఎదను ఎవరో నలిపివేస్తున్నట్లు చీల్చివేస్తున్నట్లు అనిపించింది. జయరావు కొత్త గుండె ఆనందాతిరేకాన్ని తట్టుకోలేకపోయిందో, శ్యామరావు ప్రతీకారపు పరవళ్ళను భరించలేకపోయిందో కాని పగిలిపోయింది.

"అమ్మా" అని అరుస్తూ ఎదపై చేయి వుంచుకుని కుప్పకూలిపోయాడు జయరావు. పాల పొంగు నల్లారినట్లు అదిరిపడుతున్న గుండె ఆగిపోయింది.

ఆంధ్రభూమి సచిత్ర మాసపత్రిక, అక్టోబర్ 1996